క్లుప్తంగా

వరదలతో స్తంభించిన రవాణా

బూర్గంపాడు: గోదావరి వరదలతో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే లారీలు సారపాకలోనే నిలిచిపోయాయి. భద్రాచలం-నెల్లిపాక మధ్య గోదావరి వరద జాతీయ రహదారిపైకి చేరటంతో దూరప్రాంతాలకు సరుకును తీసుకెళ్లే లారీలు రెండురోజులుగా సారపాకలోనే నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రం వరకు కూడా ఈ మార్గంలో వరద నీరు తగ్గకపోవటంతో వందల లారీలు ఎక్కడవి అక్కడే నిలిచివున్నాయి.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని ఆందోళన



బూర్గంపాడు తహసీల్ వద్ద ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

బూర్గంపాడు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆటోడ్రైవర్లకు గోదావరి వరదలు పుండు మీద కారం చల్లినట్లుగా ఉందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ అన్నారు. గత పదిరోజులుగా గోదావరి వరదలతో ఆటోలు నడవక, పూట గడవక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లు ఆదివారం తహసీల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పున్నంచంద్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు నెలవారీ ఫైనాన్స్ కిస్తీలు కూడా కట్టలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకుని వారికి ఆర్థికభరోసానివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు కోట దారుగా, ఎస్కే షరీఫ్, గవ్వల మధు, కుచ్చర్లపాటి ప్రభాకర్,కొండా, రాజా రమేష్, రెడ్డి పుష్పరాజ్, పిట్టల వెంకటేశ్వర్లు, చెన్నం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కరకగూడెం: మండల పరిధిలోని తాటిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దుర్గం సంజీవ భార్య దుర్గ ఇటీవల ఆనారోగ్యంతో మరణించగా ఆదివారం ఆమె దశ దిన కర్మలకు ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ హాజరై ఆమె కుటుంబ సభ్యులకు రూ.10,000 నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జిమిడి ప్రకాష్, సంఘం నాయకులు జాడి నాగరాజు, జాడి శ్రీనివాస్, దుర్గం ప్రసాద్, కొండగొర్ల కోటేష్, గోగు విశ్వనాథం, జాడి రవి, రాజు, సోమయ్య, దుర్గం శరత్ బాబు, సతీష్, కృష్ణ, గోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు వినతి

భద్రాచలంఅర్బన్: గోండ్వాన సంక్షేమ పరిషత్ నాయకులు ఆదివారం తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిసి పలు అంశాలపై వినతులు అందజేశారు. 5వ షెడ్యూల్‌లో జీవో నం.3కి ప్రత్యామ్నాయంగా కొత్త జీఓ తీసుకురావడం, ఐటీడీఏలోని 29 శాఖలను ఐటీడీఏ ఆధ్వర్యంలోనే నడపడం, ఆగస్టు9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించడం వంటి 14 అంశాలపై మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు రమానాల లక్ష్మయ్య, వట్టం ఉపేందర్, పొడుగు శ్రీనాథ్, వట్టం నారాయణ, పాయం సత్యనారాయణ,కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, వాసం నాగేశ్వర రావు, చందా మహేష్, కొమరం ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి సన్మానం

అశ్వాపురం: జెడ్పీటీసీల పదవికాలం ముగుస్తుండటంతో కొత్తగూడెంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, గోపాలకృష్ణారెడ్డి దంపతులను జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, సీఈఓ శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీకి జ్ఞాపిక బహూకరించారు.

సేవలు విస్తృతపరచాలి

మణుగూరుటౌన్: వాసవీక్లబ్, వాసవీ వనితా వైభవం సేవలు మరింత విస్తృతం చేయాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వరరావు, ఐపీసీ వనమా రామకృష్ణ, బండారు నర్సింహారావులు అన్నారు. ఆదివారం మణుగూరులో జరిగిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్, జోన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం ఎన్నికైన అనంతరం మణుగూరు, సారపాక క్లబ్బులు అనేక సేవా కార్యక్రమాలు చేయడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డైరెక్టర్‌ను, రీజియన్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, మణుగూరు, సారపాక వాసవీక్లబ్ అధ్యక్షులు కేసా రాజేంద్ర ప్రసాద్, మనోజ్, స్వరూపారాణి, రీజియన్ చైర్మన్ కడివెండి విశ్వనాథగుప్తా, జోన్ చైర్మన్ శేషుబాబు, డిస్ట్రిక్ జాయింట్ సెక్రటరీ దింటకుర్తి బ్రహ్మయ్య, ఆర్యవైశ్య నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్తిరాము, చిత్తలూరి రమేశ్, శ్యామ్, నాగరాజు, వసుంధర పాల్గొన్నారు.

బాధితులకు భోజనం బాగోలేదు..

- పునరావాస కేంద్రంలో భోజనం ఏర్పాటు
- నాణ్యతపై సర్వత్రా అసంతృప్తి



పునరావాస కేంద్రంలో ముంపు బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గోదావరి వరద ముంపు, బ్యాక్ వాటర్ నీటి సమస్యతో ఏఎంసీ, అశోక్‌నగర్ కొత్త కాలనీ ప్రజలను అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ క్రమంలో వారికి మూడు పూటలు భోజనం, గూడు, మందులు,ఇలా అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదే. ఈ క్రమంలో శనివారం రోజున మధ్యాహ్నం, రాత్రి భోజనం, ఆదివారం ఉదయం ముంపు బాధితులకు అందజేసిన భోజనం, టిఫిన్‌లలో ఎలాంటి సమస్య తలేత్తలేదు. కాకపోతే ఆదివారం మధ్యాహ్నం ముంపు బాధితులకు వడ్డించే భోజనం సరిగ్గా ఉడకలేదని, పప్పు నీరు లాగా ఉందని వరద ముంపు బాధితులు అధికారులు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. కొంత మంది అసల భోజనమే చేయని పరిస్థితి నెలకొన్నట్లు ముంపు కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అన్నం తినలేకపోయాం..



ఆదివారం మధ్యాహ్నం అధికారులు ఏర్పాటు చేసిన భోజనం తినలేని విధంగా ఉంది. ఏ మాత్రం అన్నం ఉడకలేదు. అసలే వరదల కారణంగా ఇంటికి వదిలేసి ఇక్కడ ఉంటున్నాం. అధికారులు ఇలాంటి సమయంలో కూడా బాధ్యత తీసుకోకపోతే ఎలా. మాపై చిన్నచూపు తగదు. మా పిల్లలు కూడా భోజనం చేయలేదు.

– సుజాత, అశోక్‌నగర్ కొత్తకాలనీ, భద్రాచలం

ఎన్నాళ్లు మాకీ కష్టాలు..



ప్రతి ఏటా వచ్చే వరదల కారణంగా మేము సర్వం కోల్పోవాల్సిన దుస్థితి. మాకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎంత మందిని కోరినా ఏమీ ఫలితం ఉండటం లేదు. ఇంకా ఎన్నాళ్లు మాకు ఈ కష్టాలు. అధికారుల ఇప్పటికైనా మా కాలనీ వాసులకు నూతన గృహాలు నిర్మించి అందజేయాలి.

– పైలవరపు లక్ష్మి, అశోక్‌నగర్ కొత్తకాలనీ, భద్రాచలం

చిన్న పిల్లలూ ముట్టలేదు..



మేము శనివారం మధ్యాహ్నం పునరావాస కేంద్రంలోని వచ్చాంజ శనివారం మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, అదే విధంగా ఆదివారం ఉదయం పెట్టిన టిఫిన్ అంతాబాగానే ఉంది. కానీ ఆదివారం మధ్యాహ్నం మాకు పెట్టిన భోజనం అసలు ఉడకలేదు. మాతో పాటు చిన్న పిల్లలు కూడా ఒక్క ముద్ద నోట్లో పెట్టుకోలేని విధంగా భోజనం ఉంది.

– ముద్దా ఆశ, ఏఎంసీ కాలనీ, భద్రాచలం

ముమ్మరంగా వాహన తనిఖీలు



దుమ్ముగూడెం: పెద్దబండిరేవు రహదారిలో యువకులను ప్రశ్నిస్తున్న సీఐ అశోక్

దుమ్ముగూడెం: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మండలంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలను చేపట్టారు. సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్‌లు ప్రత్యేక బలగాలతో తనిఖీలను నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టులు లేఖలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మండల సరిహద్దు గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతానికి అనుకుని ఉన్న గ్రామాలతో పాటు అటవీప్రాంతంలో స్పెషల్ పార్టీ పోలీసులతో కూంబింగ్ నిర్వహిస్తూ వారోత్సవాల సమయంలో మండలంలో ఎటువంటి అలజడి జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పినపాక: అసాంఘిక శక్తుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో జానంపేటలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, అసాంఘిక శక్తుల వారికి ఆశ్రయం కల్పించకూడదని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపాత్ర లేని వాహనాలను సీట్ చేసి స్టేషన్కు తరలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్ల: మావోయిస్టు పార్టీ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అటు సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తూనే ఇటు వాహన తనిఖీలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా సరిహద్దు అటవీ ప్రాంత గ్రామాలకు వెళ్లే ఆర్ కొత్తగూడెం, కలివేరు, తాలిపేరు ప్రాజెక్టు తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తూ వచ్చి పోయే వారి వివరాలను సేకరిస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారు, ఎందుకు వెళ్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. మావోయిస్టులకు అవసరమైన సామగ్రి, మందుగుండు సామాగ్రి తదితర వస్తువులును మావోయిస్టులకు చేరవేయవచ్చుననే అనుమానంతో వచ్చి పోయే వాహనాలను సైతం నిలిపి వాటిల్లో తీసుకెళ్తున్న లగేజీలను తనిఖీ చేస్తున్నారు. చర్ల సీఐ ఏ రాజువర్మ నేతృత్వంలో ఎస్సై నర్సిరెడ్డి సివిల్, స్పెషల్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు.

మురుగునీటిలో భగీరథ పైపులైన్ వాల్వ్



మిషన్ భగీరథ (గ్రిడ్) వాల్వ్ చుట్టూ చేరిన మురుగు నీరు

ములకలపల్లి: ప్రజలకు శుద్ధజలం అందించే మిషన్ భగీరథ (గ్రిడ్) మెయిన్ పైపులైన్ వాల్వ్ మురుగు నీటితో నిండిపోయింది. మండలపరిధిలోని వీకే.రామవరం, కొత్తూరు గ్రామాల మధ్య పంటచేలల్లోని మురుగునీటిలో మిషన్ భగీరథ మెయిల్ వాల్వ్ కనిపిస్తోంది. పలుగ్రామాలకు తాగునీరందించే వాల్వ్ ఇలా దర్శనమివ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చుట్టూ మురుగునీరు నిలిచి, తాగునీరు కలుషితం అవుతుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

నిత్యావసరాల వితరణ

భద్రాచలంఅర్బన్: పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో అతి చిన్న వయసులో రెండు సంవత్సరాల క్రితం ఆరోగ్య సమస్యతో మరణించి ఆరుగురికి ప్రాణదానం చేసిన సిద్దు జ్ఞాపకార్థం ఆదివారం వికలాంగులకు నిత్యవసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షులు కొమ్మ గిరి వెంకటేశ్వర్లు, డాక్టర్ భాను ప్రసాద్, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు తాళ్లప్రగడ శేషు కుమారి, రేపల్లి పద్మ, నల్ల పోతుల రాణి, గొడ్ల జెస్సి, సత్యానంద శ్రీనివాస్, బర్ల జాన్ కుమార్, బర్ల సునీత, గూడాల ఆనంద్, బర్ల వెంకట్, కడారి రితీష్, దుద్దుకూరి లక్ష్మయ్య, పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి సభ్యులు, మహాజన సోషలిస్టు పార్టీ, మహాజన మహిళా సమైక్య, ఎంఎంఎస్ తదితర పార్టీలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.20 వేలు ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం నన్నపనేని పాఠశాలలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని సీపీఎం పార్టీ పట్టణ కమిటీ బృందం ఆదివారం పరిశీలించింది. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణం గోదావరి వరద ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. అశోక్ నగర్ కొత్త కాలనీలో స్లూయిజ్ వద్ద ఏర్పాటు చేసిన 50హెచ్‌పీ మోటార్లు సరిగ్గా పనిచేయడం లేదని తెలిపారు. పురావస కేంద్రంలో ఉన్న గదులలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, పిల్లలకు పాలు, రొట్టె అందించాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు, సంద్ర భూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎల్ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన గొలిశెట్టి కొర్రాజులుకు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎల్ఓసీను మంజూరు చేయించారు. గొలిశెట్టి కొర్రాజులు గత కొంతకాలంగా చర్మ సంబంధిత వ్యాధితో పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, బాధితుడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి పంపారు. అతడు వైద్య ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాడనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, చికిత్సకు నిమిత్తం రూ.1,20,000ల ఎల్ఓసీని మంజూరు చేయించి, బాధితుడి మిత్రుడుకి హైదారాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆదివారం అందజేశారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

మణుగూరురూరల్: సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో మానవీయ విలువలను పెంపొందింపజేయాలని, సామాజిక అంశాలపై అవగాహన పెంచాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ వారిని ఆయన అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన 30మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లగట్ల సత్యప్రసాష్, షేక్ మీరాహుస్సేన్, చార్టర్ ప్రెసిడెంట్ పిళ్లారిశెట్టి హరిబాబు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడుదాం

గుండాల: కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత అసంఘటిత కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం అల్లపల్లి మండలంలో ఏఐటీయూసీ 1వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చాలనే కుట్రను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కార్మికులకు నిధులు కేటాంపులు జరుపలేదని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితిలో ఏఐటీయూసీ నాయకత్వంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రేసు ఎల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు యూసుఫ్, జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు పరమ ఇమ్మానుయేలు, మండల సహాయ కార్యదర్శి కొమరం హన్మంతరావు,మండల కోఆప్షన్ సభ్యులు రహీం, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు, హమాలీ, గ్రామపంచాయతి, ఆటో, మ్యాజిక్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సాగు సందడి!



వరి నాట్లు వేస్తున్న కూలీలు

అశ్వారావుపేటరూరల్: గడిచిన పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నం కాగా, సాగు సందడి నెలకొంది. అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా కురిసిన వర్షాలతో చెరువుల ఆయకట్టు, మెరక పొలాల్లో సాగు పనులు జోరందుకున్నాయి. వరి నారు చేతికందడం, వర్షాలు సైతం సమృద్ధిగా కురవడంతో ట్రాక్టర్లతో దుక్కి దున్నే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే వరి నారు చేతి కందడంతో కూలీలతో వరి నాట్లు వేస్తున్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

పోడు పట్టాలివ్వాలి

ములకలపల్లి: గిరిజనులు ఎన్నోఏళ్లుగ సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి జిల్లా అధికారులను కోరారు. కొత్తగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆమె పలుసమస్యలను అధికారులను విన్నవించారు. మండలపరిధిలోని గుట్టగూడెం, చౌటిగూడెం గ్రామాలకు చెందిన 300 మంది సాగుదారులకు హక్కుపత్రాలు మంజూరు చేయలేదని, వారందరికీ న్యాయం చేయాలన్నారు. అదేవిదంగా ములకలపల్లిలో నిర్మాణం పూర్తయిన మంగపేట పీహెచ్‌సీ నూతన భవనాన్ని త్వరిగతిన ప్రారంభించి, రోగులకు అందుబాటులోకి తేవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌పై మణుగూరు వైపు వెళ్తుండగా అశ్వాపురం వైపు వస్తున్న కారు ఐఓసీ పెట్రోల్ బంక్ ఎదుట కారు, బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగరాజుకు గాయాలు కాగా స్థానికులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు.

ప్రమాదకరంగా హోర్డింగ్‌లు



ఈదురుగాలులకు బ్రిడ్జి సెంటర్ వద్ద పడిపోయిన భారీ హోర్డింగ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఇటీవల కురిసిన వర్షాలు, దీనికి తోడు బలమైన ఈదురుగాలులు రావడంతో బ్రిడ్జి సెంటర్‌లోని పార్క్ వద్ద ప్రచారం కోసం ఏర్పాటు చేసిన హోర్డింగ్ కూలిపోయేలా తయారయ్యాయి. తద్వారా దగ్గరలో ఉన్న వారికి ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉంది. పట్టణంలో ప్రధాన రహదారికి అనుకుని ఉన్న భవనాల పై ప్రచారం కోసం భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈదురగాలులకు భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు పడిపోయే అవకాశం లేకపోలేదు. దీనిపై చర్యలు తీసుకునే నాథుడే లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించేకంటే ముందస్తుగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

డిపోలో మెయింటెనెన్స్ డే



మెయింటెనెన్స్ డేలో పాల్గొన్న మెకానిక్‌లు, డ్రైవర్లు, అధికారులు

భద్రాచలం: ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రాచలం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో మెయింటెనెన్స్ డేను నిర్వహించారు. డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది నడుమ పరస్పర అవగాహన కల్పించి సలహాలు, సూచనలను స్వీకరించారు. అనంతరం మెకానిక్‌లు వర్షాకాలంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉత్తమ మెకానిక్‌గా సాయిరాంను శాలువాతో సత్కరించారు. ట్రాఫిక్ మేనేజర్ గౌతమి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బ్లాకులను సింగరేణికే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక శ్రామిక భవన్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలం వల్ల సింగరేణికి, కార్మికవర్గానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సింగరేణి పరిరక్షణపై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన తలపెట్టిన యాత్ర ఆగస్టు 5వ తేదీతో ముగియనుందన్నారు. ఆగస్టు 3వ తేదీన ఈ యాత్ర మణుగూరుకు చేరుకుంటుందని, మధ్యాహ్నం అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. 5వ తేదీన కొత్తగూడెంలో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ యాత్రలో వివిధ పని ప్రదేశాల్లో పని చేస్తున్న యాత్ర నాయకులు పర్యటించి ప్రసంగిస్తారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే యాత్రలను నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, నాయకులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం, నాయకులు పల్లపు నాగేశ్వరరావు, కోండ్రు గౌరి, బొల్లం రాజు, శైలజ, వెంకన్న, సదానందం, ఉత్తమ్, రంగ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన మహిళామణులు



అశ్వారావుపేటరూరల్: బోనాలతో ఊరేగింపుగా తరలుతున్న మహిళలు



భద్రాచలంఅర్బన్: బోనాల సమర్పణ ముందు బిందెపై నృత్యం చేస్తున్న మహిళ

దమ్మపేట: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయం, ఆచార వ్యవహారాల మేరకు వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు, సిరులతో రైతులు సంక్షేమంగా ఉండాలని కోరుతూ.. ముత్యాలమ్మకు నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. మహిళ భక్తులు బోనాలు ఎత్తుకుని, ఆలయానికి వెళ్తుండగా మేళ తాళాలతో, నృత్యాలతో గ్రామస్తులు అంతా సందడిగా వెంట కదిలారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళ భక్తులకు చీరలు, గాజులను పంపిణీ చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను వితరణగా అందజేశారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అంకమ్మతల్లి ఆలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో మేళ తాళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి, బోనాలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆషాడ మాసంలో ప్రతి ఏటా వచ్చే బోనాల సందర్భంగా ఆదివారం పట్టణంలో వివిధ కాలనీల నుంచి మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించి, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ క్రమంలో ఆలయ అర్చకులు అమ్మవారిని ఘనంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పలు చోట్ల బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అశ్వారావుపేటలోని మద్దిరావమ్మ ఆలయం, కొనేరు బజారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయం, అదే విధంగా మండలంలోని ఊట్లపల్లి, ఆసుపాక గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాల్లో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో బోనాలతో ప్రదీక్షణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊట్లపల్లి గ్రామంలో బోనాలతోపాటు, ముత్యాలమ్మ తల్లికు సారె, వివిధ రకాల స్వీట్లు, పండ్లతో నైవేద్యాలు సమర్పించారు. మేళ తాళాలు, మహిళల నృత్యాలతో బోనాల ఉత్సవాలు సందడిగా సాగాయి.

చిన్నారుల డప్పు దరువులు

ఆషాడ మాసం సందర్భంగా అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయం నుంచి వెంకమ్మ చెరువు కట్ట కింద ఉన్న అంజనేయస్వామి విగ్రహం వరకు, అలాగే గ్రామ పురవిధుల్లో మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా తరలిరాగా.. ఈ ఊరేగింపులో గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు డప్పు దరువులు వేసి ఆకట్టుకున్నారు.